

కెరమెరిలో 38.8 డిగ్రీల ఉష్ణోగ్రత

ఆసిఫాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరిలో ఆదివారం 38.8 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. పెంచికలపేటలో 38.7, తిర్యాణిలో 38.4, రెబ్బెన, ఆసిఫాబాద్ మండలాల్లో 38.2, దహెగాంలో 38, కాగజ్‌నగర్‌లో 37.9, బెజ్జూరులో 37.8, వాంకిడి, సిర్పూర్(టి) మండలాల్లో 37.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చింతలమానేపల్లిలో 37.4, కౌటాలలో 37.3, జైనూర్‌లో 35.3, లింగాపూర్‌లో 35, సిర్పూర్(యూ)లో 34.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

పతంజలి భారత్ స్వాభిమాన్ మండల కమిటీ

కౌటాల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రామాలయంలో ఆదివారం పతంజలి భారత స్వాభిమాన్ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, దాసరి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో కౌటాల మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దౌలత్, ఉపాధ్యక్షుడిగా బ్రహ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ, కోశాధికారిగా విజయ్‌కుమార్, కార్యదర్శిగా అశోక్, శ్రేష్ఠ, వంశీ, సభ్యులుగా అఖిల్ సింగ్, నాగచైతన్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రవీంద్రగౌడ్‌ను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికైన సభ్యులు సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మహిళా గురుకుల గిరిజన డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం మే 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శారద ఆదివారం ఒక ప్రకటలో తెలిపారు. ఇంటర్మీ డియట్ పూర్తి చేసిన గిరిజన, గిరిజనేతర విద్యార్థులు కళాశాలలో అందుబాటులో ఉన్న బీఏ, బీజడ్‌సీ, ఎంబీ జడ్‌సీ, ఎంపీసీ, ఎంపీసీఎస్ తదితర గ్రూపులలో ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

వేసవి శిబిరాలు.. అరకొర నిధులు

- శిక్షకులకు నామమాత్రపు వేతనాలు
- మూడు మండలాల్లో క్రీడా శిక్షణ
- నెల రోజుల పాటు కొనసాగనున్న క్యాంపు
- కనీస సౌకర్యాలు కల్పించాలని వినతి



క్రికెట్ ఆడుతున్న విద్యార్థులు

పుస్తకాలతో కుస్తీ పట్టిన పిల్లలు.. వేసవి సెలవుల్లో ఆటలపై పట్టు పెంచుకోనున్నారు. ఈ మేరకు జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ(డీఎస్‌వో) వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు సన్నద్ధం చేస్తోంది. మే 1 నుంచి పలు చోట్ల శిబిరాలు నిర్వహించేలా కార్యాచరణ సిద్ధం చేశారు.

కాగజ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వేసవి క్రీడా శిబిరాలు ఏటా నిర్వహిస్తున్నప్పటికీ సరిపడా నిధులు ఇవ్వడంతో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తు న్నాయి. ప్రతీ వేసవిలో నెల రోజుల పాటు కొనసాగే క్రీడా శిబిరాలు చిన్నారులు, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఎంతగానో ఉపయోగపడుతాయి. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈసారి కూడా నామమాత్రంగానే నిధులు విడుదల చేసిందని చెబుతున్నారు. నిధులు నామమాత్రంగా ఉండడంతో క్రీడా సంస్థలు ఏం చేయలేక పోతున్నాయి. ఒక్కో జిల్లాకు ఏటా ఒక్కో క్రీడా శిక్షకుడికి కేవలం రూ. 4వేలు నామమాత్రపు గౌరవ వేతనం కేటాయిస్తున్నాయి. ఈ నిధులు ఎటూ సరిపోవడం లేదని వాపోతున్నారు. వేసవి క్రీడా శిబిరాల్లో జిల్లాకు 10 చొప్పున క్రీడలను ఏటా నిర్వహి స్తారు. విద్యార్థులు, 14 సంవత్సరాల లోపు పిల్లలు ఏ ఆటలో ఆసక్తి ఉంటే ఆయా క్రీడల్లో శిక్షణనిచ్చి వారిలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసే అవకాశా లుంటాయి. అదనపు నిధులు, సౌకార్యాలు కల్పించిన ట్లయితే సీనియర్ క్రీడా కారులు, వ్యాయామ విద్య పూర్తి చేసిన ఔత్సాహికులు, శిక్షకులు, క్రీడాభిమానులు వేసవి క్రీడా శిబిరాలకు మరింత మంది వచ్చేవిధంగా అవగాహన కల్పిస్తారు.

● మే 1 నుంచి..

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు మే 1 నుంచి ప్రారంబించనున్నారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ(డీఎస్‌వో) ఆధ్వర్యంలో మే 31 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 14 ఏళ్లలోపు బాల, బాలికలకు ఇష్టమైన ఆటల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో భాగంగా శిక్షణనిచ్చేందుకు పీఈటీలు, పీడీ లు, సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వా నించారు. జిల్లా వ్యాప్తంగా 10 క్రీడల్లో శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. కాగజ్‌గనర్, ఆసిఫాబాద్, తిర్యాణిలో శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఎంపిక చేశారు. క్రీడలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసున్నారు. ఇందుకోసం గ్రామీణ ప్రాంతాలను ఎంపిక చేశారు. జిల్లాలోని మిగిలిన ప్రాంతాల నుంచి దరఖాస్తులు రాకుండా పోయాయి. కౌటాలలో మిని స్టేడియం ఉన్నప్పటికీ అక్కడి నుంచి ఎలాంటి దరఖాస్తులు అందలేదని చెబుతున్నారు. కబడ్డీ, ఖోఖో, బాక్సింగ్, అథ్లెటిక్స్, కరాటే, సాఫ్ట్ బాల్, హ్యాండ్ బాల్, వాలీబాల్, షూటింగ్ బాల్ తదితర క్రీడలు నెల రోజుల పాటు వేసవి సెలవుల్లో నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మేరకు శిక్షకులకు ప్రభుత్వం ఇచ్చే పారితోషికం నామమాత్రంగా ఉంటుంది. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు, వారికి శిక్షణనిచ్చి మంచి క్రీడాకారులుగా ఎదిగేందుకు శిబిరాలు నిర్వహిస్తున్నప్పటికీ సరైన నిధులు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడంలే దు. ఒక్కో క్రీడకు కేవలం రూ. 4వేలు చొప్పున విడుదల చేయడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని వ్యాయామో పాధ్యాయులు చెబుతు న్నారు. ఉదయం 6 గంటల నుంచి, సాయంత్రం 4 నుంచి ఆటలు ఆడిస్తారు. జిల్లాలోని ఆసిఫాబాద్ పరిధిలో సరండి, కాగజ్‌గనర్ పరిధిలో బురదగూడ, రాస్పెల్లి, కాగజ్‌నగర్‌లలో క్రీడలు నిర్వహిస్తున్నారు. తిర్యాణి మండలంలోనూ శిక్షణ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు అందజేయనున్నారు.

క్రీడా శిబిరాల వివరాలు..

మండలం	క్రీడాంశం
కాగజ్‌నగర్	కరాటే, బాక్సింగ్, షూటింగ్ బాల్, సాఫ్ట్‌బాల్
ఆసిఫాబాద్	హ్యాండ్‌బాల్, ఖోఖో, నెట్‌బాల్
తిర్యాణి	అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్

మరిన్ని నిధులు పెంచాలి..

-సలీం, సీనియర్ శిక్షకుడు



కాగజ్‌నగర్‌లో ప్రతీ రోజూ విద్యార్థులకు ఉదయం, సాయంత్రం క్రికెట్‌తోపాటు పలు క్రీడలపై ఉచితంగా శిక్షణను అందిస్తున్నాం. ప్రభుత్వం నుంచి వచ్చే అరకొర నిధులు సరిపోవు, ఉత్సాహ వంతులు ఎక్కువగా ఉన్న చోట నిధులు పెంచాలి. జిల్లాలోని కాగజ్‌నగర్‌కు ఎక్కు వగా కోచింగ్ కేంద్రాలకు అవకాశం ఇవ్వాలి. పిల్లలకు పాలు, గుడ్లు, పోషకాహారం, బ్రేక్ ఫాస్ట్, పండ్లు, తాగు నీటి వసతిని అందించేందుకు చర్యలు తీసుకోవాలి.

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు



ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేస్తున్న ఆర్‌పీఎఫ్ సిబ్బంది

కాగజ్‌నగర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): భారత సరిహద్దులో ఏర్పడిన ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో శనివారం కాగజ్‌నగర్ ఆర్‌పీఎఫ్ పోలీసులు రైల్వే స్టేషన్‌లో తనిఖీ చేశారు. ఆదివారం ఉదయం రైల్వే స్టేషన్‌లో సీఐ సురేష్ బాబు ఆధ్వర్యంలో కవాతు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రయాణికులు వద్ద ఉన్న వస్తువుల సామగ్రిని, ఆధార్ కార్డులను పరిశీలించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ కాశ్మీర సరిహద్దున ఉద్రిక్త పరిస్థితులున్న నేపథ్యంలో అన్ని రైల్వేస్టేషన్లలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ తరుపున తనిఖీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనుమానిత వ్యక్తులు, వస్తువులున్న కూడా వెంటనే తమ సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. అందుబాటులో లేని పక్షంలో 139కు సమాచారం అందించాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రజల ప్రాణాలు కాపాడిన వాళ్లమవుతామని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ ఎస్సై ప్రాచిదేవి, ఏఎస్సై దాసు, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని శ్రీ రేవతి ఉన్నత పాఠశాలలో 2003-2004వ బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి మిత్రులను కలుసుకుని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. సరదాగా ఆటపాటలతో గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శోభ, ఉష, విజయ్‌కుమార్, శ్రీనాథ్, హన్మాన్‌చారి, శ్రీనివాస్, సంతోష్, హరీష్, మల్లేష్, స్వప్నిల్, నారాయణ, రాజేష్, నితేష్, కార్తీక్, పెంటయ్య, దాస్, కిరణ్, ఇమ్రాన్, శారద, ముబీన, వీణ, శారద, శ్వేత, సౌమ్య, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్లు అందజేత

బెజ్జూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న ఫోన్లను గుర్తించి ఆదివారం ఎస్సై ప్రవీణ్‌కుమార్ బాధితులకు అందజేశారు. దహెగాం మండలానికి చెందిన సాయి, బెజ్జూరు మండలం కాటేపల్లికి చెందిన నాందేవ్ అనే వ్యక్తులకు చెందిన ఫోన్లు పోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్‌లు గుర్తించి ఆదివారం ఎస్సై ప్రవీణ్‌కుమార్ బాధితులకు అందజేశారు. ఎస్సై మాట్లాడుతూ ఫోన్లు పోయినా, చోరీకి గురైనా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

బెజ్జూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని ముంజంపల్లి గ్రామంలో యువతకు ఆదివారం వాలీ బాల్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువకులు గ్రామాల అభివృద్ధిలో పాటు పంచుకోవాలని చెప్పారు. మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. జీవితంలో ఉన్నత స్థానం చేరుకునేందుకు క్రమశిక్షణతో చదవా లని చెప్పారు. చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు.

ప్రశాంతంగా టీఎస్‌మోడల్ ప్రవేశ పరీక్ష



హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం నిర్వహించిన టీఎస్ మోడల్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల, టీఎస్ మోడల్ స్కూల్‌లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం జరిగిన 6వ తరగతి ప్రవేశ పరీక్షకు 491 మంది విద్యార్థులకు గాను 397 మంది హాజరయ్యారు. 94 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 7 నుంచి పదో తరగతిలో ఖాళీ సీట్ల కోసం ప్రవేశ పరీక్ష నిర్వహించగా 404 మంది విద్యార్థులకు గాను 319 హాజరయ్యారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాలను జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ ఉదయబాబు తదతరులు పరిశీలించారు.

వరంగల్‌కు తరలివెళ్లిన బీఆర్ఎస్ శ్రేణులు



వరంగల్‌కు తరలివెళుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, పార్టీ శ్రేణులు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఆలీబీన్ అహ్మద్, పార్టీ మండల అధ్యక్షుడు జబరే రవిందర్, మాజీ జడ్పీటీసీ అరుణ, టౌన్ ప్రెసిడెంట్ అహ్మద్, నాయకులు అహ్మద్, తాజ్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): వరంగల్ సభకు కాగజ్‌నగర్ నుంచి బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. ఏడు మండలాల నుంచి కార్యకర్తలు, నాయకులు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నివాసానికి చేరుకున్నారు. అనంతరం డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సారథ్యంలో కార్లు, బస్సుల్లో అధిక సంఖ్యలో తరలి వెళ్లారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించే బీఆర్ఎస్ బహిరంగ సభకు రెబ్బెన మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు బయలు దేరి వెళ్లారు. మండల శాఖ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కె సంజీవ్, మహేష్, రాజేశ్వరరావ, దుర్గారావు, శ్రీధర్, వనజ, శంకరమ్మ,పద్మ పాల్గొన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి వరంగల్ జిల్లాలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు బీఆర్ఎస్ నాయకులు ఆదివారం తరలి వెళ్లారు. అంతకు ముందు బస్టాండు ఏరియాలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్దుల్లా తదితరులు ఉన్నారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలం నుంచి పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకు లు వరంగల్ జిల్లాలో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ కార్యక్రమానికి తరలి వెళ్లారు. అంతకు ముందు మండల కేంద్రంలో పార్టీ జెం డా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు అజయ్‌కుమార్, పెంటూ, తుకారాం, అశోక్, వినోద్, రాకేష్, వినోద్, సోను, తులసీరాం, రవి, రాము శ్రీకాంత్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలోని తుంగతుర్తిలో జరిగిన కేసీఆర్ మహాసభ, బీఆర్ఎస్ రజతోత్సవ సభకు చింతలమానేపల్లి నుంచి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. అంతకు ముందు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు లహంచు, తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు వరంగల్ జిల్లాలో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ కార్యక్రమానికి తరలి వెళ్లారు. కార్యక్రమంలో అబ్దుల్ కలాం, ధృపతాబాయి, మోతిరాం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్ నుంచి కార్యకర్తలతో వెళుతున్న ప్రవీణ్‌కుమార్

సామాజిక ఆసుపత్రిలో అత్యవసర మందులు కరువు

సిర్పూర్(టి), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో ఫార్మాసిస్టు పోస్టు ఖాళీగా ఉండడంతో అ్యతవసర మందులు అందుబాటులో లేకుండా పోయాయి. ఈ ఆసుపత్రికి వచ్చే పేద రోగులు ఇబ్బందులు పడుతున్నారు. మందుల స్టోర్ గదిలో జ్వరానికి సంబందించిన ఐవీ సెట్, బీ12 ఇంజక్షన్, టీటీ అసలే లేక పోవడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు అత్యవసర సమయంలో బయట నుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఐవీ సెట్ రూ.570 ఉండగా బీ12 రూ.50 నుంచి రూ.100 ధర ఉంది. టీటీ ఇంజక్షన్ సైతం రోగులు బయటి నుంచి తెచ్చుకుంటున్నారు. ఈ ఆసుపత్రికి కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూరు మండలాల నుంచి ప్రజలు వస్తుంటారు. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి

పంచాయతీ ఆదాయానికి గండి



తిర్యాణిలో ప్రైవేటు వ్యక్తి స్థలంలో నిర్వహిస్తున్న వారసంత

- ప్రైవేట్ స్థలంలో వారసంత నిర్వహణ
- వసతులు లేక వ్యాపారుల అవస్థలు

తిర్యాణి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్వహించే వారసంత ప్రైవేట్ స్థలంలో నిర్వహిస్తుండడంతో పంచాయతీ ఆదాయం కోల్పోతోంది. వారానికి సరిపడా కూరగాయలు, నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు చిన్న చిన్న పట్టణంలో, మేజర్ గ్రామ పంచాయతీల్లో సంత నిర్వహిస్తుంటారు. తిర్యాణి మండల కేంద్రంలో నిర్వహించే వారసంతకు ప్రతీ వారం వందల సంఖ్యలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజ లు వచ్చి తామకు కావాల్సిన వస్తువులను కొనుగోలు చేస్తారు. కానీ క్షేత్రస్థాయిలో వారసంత ప్రైవేటు స్థలంలో నడుస్తుండడంతో ప్రజలకు, వ్యాపారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

అదనపు ఆదాయం..

గ్రామపంచాయతీలకు వారసంతల నిర్వహణ ద్వారా అదనపు ఆదాయం లభిస్తుంది. సాధారణంగా గ్రామ పంచాయతీకి ఇంటి పన్నులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులతో పాటు ఆయా గ్రామాల్లో నిర్వహించే వారసంత ద్వారా అదనపు ఆదాయం సమకూరు తుంది. కానీ మండల కేంద్రంలోని అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. వారసంత ఏర్పడి సుమారు పదేళ్లు అవుతున్నా ఇప్పటి వరకు ప్రభుత్వ స్థలం గుర్తించలేదు. ప్రైవేటు వ్యక్తికి చెందిన స్థలంలోనే వారసంత కొనసాగుతోంది. సదరు భూమి యజమాని సంతలో ఏర్పాటు చేసే ప్రతీ దుకాణదారుడి నుంచి 50 రూపాయల చొప్పున వసూలు చేస్తున్నాడు. పంచాయతీ తరుపున బాధ్యతలు తీసుకోక పోవడంతో వారసంతలో మౌలిక సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో ఇటు వినియోగదారులు, అటు వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. కూరగాయలు విక్రయించుకునేందుకు ఎలాంటి షెడ్లు లేక పోవడంతో వర్షాకాలంలో ఒక్క సారిగా భారీ వర్షం పడితే వ్యాపారులు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. ప్రైవేటు చేతుల్లో సంత నిర్వహణ ద్వారా గ్రామ పంచాయతీకి ఏడాదికి దాదాపు లక్ష రూపాయల వరకు ఆదాయం కోల్పోతుంది. మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిలో మౌలిక సదుపాయాలు కల్పించి వారసంత నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

స్థలం అందుబాటులో లేదు..

మండల కేంద్రంలో వారసంత నిర్వహణ కోసం ప్రభుత్వ స్థలం అందుబాటులో లేదు. దీంతో పంచాయతీ ఆధ్వర్యంలో సంత నిర్వహించడం లేదు. ప్రస్తుతం ప్రైవేటు స్థలంలో నిర్వహిస్తున్న సంతకు సంబంధించిన భూ యజమాని నుంచి ప్రతీ ఏడాది కొంత పారిశుధ్య నిర్వహణ రుసుం వసూలు చేస్తున్నాం.

- వేముల మల్లేశ్, ఎంపీడీవో

పశుగ్రాసానికి డిమాండ్

- ఇతర ప్రాంతాల నుంచి తరలిస్తున్న రైతులు
- తగ్గిన జొన్న సాగుతో తిప్పలు

దహెగాం/చింతలమానేపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండల తీవ్రత పెరుగడంతో పచ్చిక బయళ్లలోని గండి ఎండిపోయింది. గుట్టలు, అటవీ ప్రాంతాల్లో పూర్తిగా ఎండిపోవడంతో పశువులకు మేత దొరకని పరిస్థితి నెలకొంది. అరకొరగా ఉన్న బోరు బావుల కింద సాగు చేసిన పంటల నుంచి వచ్చే గ్రాసం పశువులకు సరిపడడం లేదు. దీంతో రైతులు పశు పోషణకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వరి పంట సాగు ఎక్కువగా ఉన్న ప్రాంతాల నుంచి ఎండుగడ్డిని కొనుగోలు చేస్తూ నిల్వ చేసుకుంటున్నారు.



పశుగ్రాసాన్ని కొనుగోలు చేసి తీసుకెళ్తున్న రైతులు

దూరప్రాంతాల నుంచి..

మండుటెండల్లోనూ ఎడ్లబండ్లు, అద్దెకు ట్రాక్టర్లు తీసుకుని కిలోమీటర్ల దూరం నుంచి పశుగ్రాసాన్ని (వరిగడ్డిని) రవాణా చేసుకుంటున్నారు. ఒకప్పుడు రైతులు తమ సాగు భూముల్లో 50 శాతం విస్తీర్ణంలో జొన్న పంట పండించేవారు. కానీ సుమారు ఐదేళ్లుగా పత్తి పంటపై మొగ్గు చూపుతూ జొన్న పంటను విస్మరిస్తు న్నారు. సాగు నీటి సౌకర్యం కల్గిన భూముల్లో మాత్రమే వరి పంటను సాగు చేస్తున్నారు. మిగతా భూముల్లో పత్తి పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. దీంతో జొన్న సాగు విస్తీర్ణం పూర్తిగా తగ్గిపోయింది. జొన్న సాగు చేసిన కాలంలో రైతులు పశువుల గ్రాసం కోసం ఏడాదికి సరిపడా జొన్న చొప్ప ఉండేది. పశు గ్రాసానికి ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కావు. పంటల సాగుపై వ్యవసాయశాఖ ఎన్నో వినూత్న ప్రయోగాలు చేస్తుండగా, పశుగ్రాసం కోసం ప్రత్యామ్నాయ మార్గాలను చూపలేక పోతున్నారు.

పశు గ్రాసం కోసం తిప్పలు..

పశు గ్రాసం కోసం తిప్పలు పడుతున్నాం. రైతుకు ఆదాయం ఇచ్చే పాడి సంతతి ఇప్పటికే తగ్గిపోతోంది. మిగిలిన కొద్ది పాటి పశువులకు పశుగ్రాసం కొరత వేడిస్తోంది. పశువులను సాకడం ప్రస్తుతం కష్టతరంగా మారింది. ఎండలతో చెరువులు, కుంటలు ఎండిపో యాయి. పశుగ్రాసానికి ఇబ్బందులు పడుతున్నాం.

- కావుడె తిరుపతి, రైతు, లోడ్‌పల్లి



పత్తి సాగుతో పశుగ్రాసం కొరత..

వానాకాలంలో మా గ్రామంలో అధికంగా పత్తి పంట సాగు చేస్తుండడంతో పశుగ్రాసం కొరత ఏర్పడుతోంది. దీంతో తాము దహెగాం మండలానికి వచ్చి కొనుగోలు చేస్తున్నాం. దహెగాం మండలం నుంచి వరిగడ్డిని కొను గోలు చేసి ప్రతి ఏడాది తీసుకు పోతున్నాం. ట్రాక్టర్ కిరా యి రూ.2500, కూలీల ఖర్చు రూ. 3000, వరిగడ్డి విక్ర యించిన రైతులకు ట్రాక్టర్ గ్రాసానికి రూ. 2000 చెల్లి స్తున్నాం. ఖర్చు అధికమైన తీసుకెళ్లక తప్పడం లేదు.

- నానయ్య, రైతు, జగన్నాథ్‌పూర్



జిల్లాలో 20,143 ఎకరాల్లో వరి

జిల్లాలో 20,143 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందు లో అత్యధికంగా దహెగాం మండ లంలో 7,956ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేశారు. దీంతో మండలం చుట్టు పక్కల ఉన్న గ్రామాల్లోని రైతులు ఇక్కడి నుంచి కొనుగోలు చేసేందుకు యత్నిస్తున్నారు. ట్రాక్టర్ వరిగడ్డికి ఇక్కడ రైతులు రెండు వేల రూపాయలకే విక్రయిస్తున్నారు. కానీ ట్రాక్టర్‌లో గడ్డి నింపేందుకు ఐదుగురు కూలీలు అవసరమవుతున్నారు. వీరికి ఒక్కొక్కరికి 600 రూపాయల చొప్పున చెల్లించాల్సి ఉందని రైతులు చెబుతున్నారు. ఇక ట్రాక్టర్ అద్దె దూరాన్ని బట్టి ఉంటుందని చెబుతున్నారు. సుమారు 20 కిలోమీటర్లు ఉంటే 2,500 రూపాయలు తీసు కుంటున్నారు. ఇంక అంతకంటే ఎక్కువ దూరం ఉంటే మరింత ఛార్జీలు చెల్లించక తప్పడం లేదు. ఒక్క ట్రాక్టర్ గడ్డిని ఇళ్ల వద్దకు చేర్చుకు నేందుకు సుమారు 7,500 నుంచి పది వేల రూపాయల వరకు చెల్లించాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. దహెగాం మండలానికి ఎక్కువగా కాగజ్‌నగర్ మండలం బోడపల్లి, జగన్నాథ్‌పూర్, అందవెల్లి గ్రామాల్లోని రైతులు వస్తున్నారని రైతులు చెబుతున్నారు. సుమారు రెండు ఎకరాల్లో వరి కోత చేపడితే ట్రాక్టర్ గడ్డి వస్తుందని స్థానిక రైతులు చెబుతున్నారు. ఇతర ప్రాంతాల్లోకి రైతులు పశుగ్రాసం కొనుగోలు చేస్తుండడంతో అదనం ఆదాయం వస్తుందని చెబుతున్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలకు సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ అహ్మద్

ఆసిఫాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పాటుపడుతున్న కార్యకర్తలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్ అహ్మద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్షులు, కార్యకర్తలతో జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన భారత్ సంవిధాన్ బచావో సభకు ఎమ్మెల్సీ దండె విఠల్, పెద్దపల్లి గ్రంథాలయ చైర్మన్ అన్నయ్యగౌడ్‌లతో కలిసి రియాజ్ అహ్మద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. రాజకీయ ఆర్థిక సమానత్వం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. పార్టీ అభివృద్ధికి గ్రామ కమిటీలు వేయనున్నట్లు వెల్లడించారు. అన్ని వర్గాలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. స్థానిక సంస్థల్లో గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ పునర్నిర్మాణానికి నిరంతర ప్రయత్నం చేయాలని సూచించారు. పార్టీని నమ్ముకుని ఉన్న అందరికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీలో ఎవరికి ఏ పదవులు ఇవ్వాలనేది అధిష్ఠానం నిర్ణయిస్తుందని, దీని గురించి ఎవరూ మాట్లాడకూడదని చెప్పారు. పునాదులు బలంగాఉంటేనే పార్టీ నిర్మాణాత్మకంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉంటుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీలో కార్యకర్తలకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లాడుతూ రాష్ట్ర ఆకాంక్ష నెరవేరినప్పటికీ మొదటి పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి జరగలేదన్నారు. జిల్లా వాసులకు ప్రాణదాయమైన గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును ప్రారంభిస్తామని చెప్పడంతో పాటు డీపీఆర్ సిద్ధం చేయడం జిల్లా ప్రజల చిరకాల వాంఛ నెరవేరినట్లు అవుతుందన్నారు. పెద్దపల్లి గ్రంథాలయ చైర్మన్ అన్నయ్యగౌడ్, జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కులు, నియోజక వర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్ మాట్లాడారు. సమావేశం ప్రారంభానికి ముందు కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో నాయకు లు బాలేష్‌గౌడ్, శ్యాం, గణపతి, రమేష్, మునీర్ అహ్మద్, చరణ్, వసంత్‌రావు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్ (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాన్ని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ ఆదివారం సందర్శించి.. సమస్యలను పాఠకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి గ్రంథాలయ చైర్మన్ అన్నయ్యగౌడ్, నాయకులు సుగుణక్క, లైబ్రేరియన్ సదానందం, వెంకటరమణ, సతిదేవి, తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ ఇంట్లో అగ్నిప్రమాదం

ఆసిఫాబాద్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని అదనపు కలెక్టర్(రెవెన్యూ) డేవిడ్ ఇంట్లో ఆదివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఇంట్లోని ఏసీ కంప్రెసర్ నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో కుటుంబీకులు భయందోళనకు గురై బయటికి వచ్చారు. సమాచారం మేరకు ఫైర్ అధికారి కార్తీక్, సిబ్బంది కుమారస్వామి, శివకుమార్, నర్సింగరావు, ప్రవీణ్‌కుమార్ అక్కడికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి కార్తీక్ మాట్లాడుతూ ఏసీ షార్ట్‌సర్క్యూట్ కావడంతో మంటలు వచ్చాయని చెప్పారు. గదిలో ఉన్న సీలింగ్ ఫ్యాన్, బీరువా, సోఫాలు, రెండు లాప్‌టాప్‌లు ఇతర వస్తు సామగ్రి కాలిపోయిందని తెలిపారు. సుమారు నాలుగు లక్షల రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశామని తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో సెల్‌ఫోన్ దుకాణం దగ్ధం



కాలిపోయిన సామగ్రి

జన్నారం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలమడుగులో శనివారం అర్ధరాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో గ్రామానికి చెందిన అయ్యోరు మల్లేశం సెల్‌ఫోన్ దుకాణం దగ్ధమైంది. రాత్రి సమయంలో షాప్ లో ఎవరులేకపోవడంతో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి కొత్త సెల్ ఫోన్‌లు కాలిపోయాయి. ఆదివారం ఉదయం ఆర్ఐ భానుచందర్ షాపును పరిశీలించి పంచనామా నిర్వహించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 16 లక్షల నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు.

విద్యుదాఘాతంతో ఇల్లు..

లింగాపూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మామిడిపల్లికి చెందిన ఆత్రం తెలంగారావు అనే వ్యక్తికి చెందిన ఇల్లు శనివారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు అంటుకుని కాలి పోయింది. డిప్యూటీ తహసీల్దార్ పెద్దరాయుడు ఆదివారం పంచనామా నిర్వహించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నస్పూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పోలీస్ పరిధిలోని తొళ్లవాగు సమీపంలో మూసి ఉంచిన బార్ భవనం సెల్లార్‌లోని బాత్ రూమ్ వద్ద గుర్తు తెలియని సుమారు 50 ఏళ్ల వయసు గల వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం గుర్తించారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం... రెండు నెలల నుంచి మూసి బార్ ఉంది. ఆదివారం బార్ నిర్వాహకులు సెల్లార్‌లోకి వెళ్లగా దుర్వాసన రావడంతో చుట్టు పక్కల గమనించారు. ఈ క్రమంలో బాత్ రూమ్ వద్ద మృతదేహం పడి ఉండటాన్ని గుర్తించారు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. మంచిర్యాల రూరల్ సీఐ అశోక్, ఎస్సై జితేందర్ లు చేరుకుని పరిశీలించారు. శవాన్ని మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మార్చురీలో భద్ర పరిచామని, సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నమని సీఐ అశోక్ తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కెరమెరి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మధుకర్ అన్నారు. సాకడ గ్రామంలో యువతకు ఆదివారం ఆయన సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్‌కాల్ వచ్చిన ప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అపరిచితులతో ఫోన్‌లో మాట్లాడకూదని చెప్పారు. వారు వివరాలు తెలుసుకుని అకౌంట్ ఖాళీ చేస్తారని తెలిపారు. అనంతరం యువతకు వాలీబాల్ కిట్ అందజేశారు.

నేడు భూ భారతి చట్టం పై అవగాహన సదస్సు

దహెగాం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం భూ భారతిపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కవిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, సబ్ కలెక్టర్‌లు హాజరు కానున్నారని, రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

మద్యానికి బానిసై వ్యక్తి మృతి

రాయికల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం మైతాపూర్ రోడ్డులో ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని మండలానికి చెందిన బొజ్జి రావు (45) అనే వ్యక్తి అతిగా మద్యం తాగి ఆదివారం మృతిచెందినట్లు రాయికల్ పోలీసులు తెలిపారు. రెండు నెలల క్రితం రాయికల్ వచ్చి కూలి పనిచేస్తున్న బొజ్జి రావు వచ్చిన డబ్బులతో మద్యం తాగేవాడని పోలీసులు తెలిపారు. ఆదివారం మైతాపూర్ రోడ్డులో బొజ్జి రావు మృత దేహం కనిపించగా శవాన్ని మార్చురీకి తరలించి విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశామని పోలీసులు పేర్కొన్నారు.

ఈదురుగాలులు.. వర్షం



పెంచికలపేట మండలం లోడ్పల్లి- బెజ్జూరు ప్రధాన రహదారిపై విరిగిపడిన చెట్టు



అయినంలో విరిగి పడిన విద్యుత్ స్తంభం

దహెగాం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా శనివారం అర్ధరాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో గిరివెల్లి, ఖర్జీ తదితర గ్రామాల్లో వరిపైరు నేలకొరిగింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం రాశులు తడిసి పోయాయి. అయినం గ్రామంలో ఈదురుగాలులతో నాలుగు విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. 33/11 కేవీ విద్యుత్ లైన్‌లో సమస్య రావడంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం రాత్రి ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. లోడ్పల్లి- బెజ్జూరు ప్రధాన రహదారిపై చెట్టు విరిగి పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆదివారం గ్రామస్థులు చెట్టును తొలగించడంతో ప్రయాణాలు సాగాయి. పలు గ్రామాల్లో కోత దశలో ఉన్న వరి పంట నేలకొరిగింది. పలు చోట్ల ధాన్యం కుప్పలు తడిసి పోకుండా కవర్లు వేసేందుకు రైతులు ఇబ్బంది పడ్డారు. అధికారులు ఆరబోసిన ధాన్యం తడిసిపోకుండా వెంట నే కొనుగోళ్లు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

అర్హులకు ఇళ్లు కేటాయించాలి

బెజ్జూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ఆదివాసీ గిరిజన మహిళలు ఆదివారం పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఇష్టారాజ్యంగా ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేశారని, ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేర్లు లేని వారికి ఇల్లు మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి ఇందిరమ్మ కమిటీలను రద్దు చేసి అర్హులైన పేదలకు ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఎంపీడీవో రావాలని, వచ్చే వరకు తాము ఆందోళన విరమించేది లేదంటూ చెప్పారు. అధికారులు, నాయకులు పేద లను పట్టించుకోవడం లేదన్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని మహిళలతో మాట్లాడారు. ఆదివారం కావడంతో అధికారులు అందుబా టులో ఉండరని చెప్పారు. అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని చెప్పడంతో గిరిజన మహిళలు అక్కడి నుంచి వెళ్లిపోయారు.



ఆందోళన చేస్తున్న మహిళలతో మాట్లాడుతున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్

దరఖాస్తులు చేసుకోవాలి

వాంకిడి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి పొందేందుకు ఇచ్చే శిక్షణకు నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకోవాలని ఉట్నూర్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్వయం ఉపాధి శిక్షణ ఫ్యాకల్టీ భీంరావు అన్నారు. మండలంలోని దాబా గ్రామంలో ఆదివారం స్వయం ఉపాధి శిక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఫ్యాకల్టీ భీంరావు మాట్లాడుతూ శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి, రవాణా సదుపాయాలు కల్పించనున్నామని తెలిపారు. బ్యూటీ పార్లర్, కుట్టు మిషన్, హౌజ్ వైరింగ్, టు వీలర్ రిపేర్, సెల్‌ఫోన్ రిపేర్, ఫొటోగ్రఫీలో శిక్షణ కోసం అర్హులైన వారు మే 10 తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

కాగజ్‌నగర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని భాగవత ప్రవచన కర్త బుర్ర భాస్కర్ శర్మ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో శ్రీమద్దేవి భాగవత ప్రవచన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రవచనాలు చెప్పారు. ప్రతి ఒక్కరూ దైవ కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. అలాగే భావి తరాల వారికి కూడా భాగవత కథలు, భక్తి, జ్ఞానం నేర్పించాలని సూచించారు. ఇందుకు తల్లి దండ్రులు కూడా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శంకరయ్య, ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళా సంఘం అధ్యక్షురాలు వంగల అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

కాల్చితే కాలుష్యం..
కలియదున్నితే భూసారం

- పంట అవశేషాలను కాల్చొద్దు
- వరి కొయ్యలు, గడ్డికి నిప్పు పెట్టొద్దు

దండేపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): యాసంగిలో సాగు చేసిన వరిపంటలు కోత దశకు రావడంతో, పంటలు కోసి కొనుగోలు కేంద్రాలకు తీసుక వస్తుండగా, మరోవైపు వానకాలం పంటల సాగు కోసం అన్నదాతలు ఇప్పటి నుంచే సర్వం సిద్ధం చేయడంలో నిమగ్నమవుతున్నారు. ఈనేపథ్యంలో వరి కోతల తరవాత రైతులు కొయ్యలతో పాటు గడ్డిని (అవశేషాలు)కాల్చుతున్నారు. అయితే అవశేషాలు కాల్చడం వల్ల భూమికి తీరని నష్టం వాటిళ్లుతుంది. పొలంలో కలియ దున్నడం వల్ల భూసారం పెరుగుతుంది. వరి కొయ్యలు, గడ్డికి నిప్పు పెట్టడం వల్ల సూక్ష్మ జీవులు, మిత్ర పురుగులు చనిపోతాయని, భూసారం దెబ్బతిని భూమికి తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. వరి కొయ్యలు ఆయా పంటల ఆవశేషాలను దహనం చేయరాదు. ఒకవేళ చేస్తే తీవ్ర నష్టం జరగొచ్చు. భూమిలోని పోషకాలు తగ్గి దిగుబడి పడిపోచ్చు. పంటకు మేలు చేసే పోషకాలు దెబ్బతింటాయి. ముఖ్యంగా నైట్రోజన్, ఫాస్పరస్. పొటాషియం ఆవిరై భవిష్యత్తులో పంటల ఉత్పాదకపై ప్రతికూల ప్రభావం పడునుంది. అంతేకాదు వాయుకాలుష్యం వల్ల రైతు ఆరోగ్యానికి చేటు కూడా, వరికొయ్యలను కలియదున్నితే భూసారం పెరిగి ఆశించిన దిగుబడి వస్తుందన్నారు. గతంలో పంటల అవశేషాలు చెత్తాచె దారం, పత్తికట్టె, వరికొయ్యలు తగులబెట్టకుండా భూ మిలోనే దున్నేవారు. ప్రస్తుతం వరికొయ్యలు కాల్చితుం డటంతో ఎన్ని ఎరువులు చల్లినా పంట దిగుబడి తగ్గుతుంది. వరి కొయ్యలకు నిప్పు పెడుతుండటంతో భూసారం తగ్గుతుందని చెబుతున్నారు. అందువల్ల వరికొయ్యలను నిప్పుపెట్టకుండా భూమిలోనే కలియ దున్నాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రొగామ్ కోఆర్డినేటర్ కోట శివకృష్ణ పేర్కొన్నారు.



వరి కొయ్యలను కాల్చుతున్న రైతులు

రైతులకు నష్టం..

- కొయ్య కళ్లను తగలబెట్టడంతో వ్యవసాయానికి మేలు జరగదు.
- ఒక్కసారి కొయ్య కాళ్లను కాల్చడంతో వ్యవసాయం 20ఏళ్లు వెనకబడినట్లే.
- మట్టిలో కోట్లాది సూక్ష్మజీవులు ఉంటాయి. ఇందులో పంటలకు మేలుచేసేవి కూడా ఉంటాయి
- వరి కొయ్యలను కాల్చడంతో వాతవరణ కాలుష్యం పెరుగుతుంది.
- విపరీతమైన వేడితో పంట భూమి సారాన్ని కల్పోతుంది.
- నత్రజని పాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గి పంట దిగుబడి పడిపోతుంది.
- భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి.
- పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి.
- నేలకు మేలు చేసే క్రిమి కీటకాలు నశించడమే కాక భూసారాన్ని తగ్గిపోతుంది.
- నేలలో గడ్డిని కలియదున్నడం వల్ల సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది.
- భూసారంతో పాటు దిగుబడులు పెరిగి రైతులకు మేలు జరుగుతుంది.
- పోలాల్లో తిరిగే పాములు, ముంగీసలు, ఉడుములు,నెమళ్లు తొండలు ఇలా అనేక జీవరాశులు చనిపోయే ప్రమాదం ఉంటుందన్నారు.

దుక్కిలో దున్నితేనే రైతుకు మేలు..

భూమిలో పంట అవశేషాలను కలియదున్ని ఎకరాకు మూడు బస్తాల సింగల్ సూపర్ పాస్పెట్ చలితే భూమిలోనే ఎరువుగా ఉపయోగపడుతుంది. రసాయన ఎరువులకు పెట్టే ఖర్చు 50 శాతం తగ్గుతుంది. రైతులకు అవగాహన లేక వారి పంట పొలాల్లో వరి కొయ్యలను కాల్చితుండటంతో నష్టం వాటిల్లుతుంది. భూమిలోనే కలియదున్నడం ద్వారా రైతుల పంటలు దిగుబడి వస్తుందన్నారు.

- శివకృష్ణ బెల్లింపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రొగామ్ కోఆర్డినేటర్

భూసారం పెంపునకు దోహదం

- వరి కొయ్యలు నేలలో కలియ దున్నడం వల్ల సేంద్రియ కర్బన శాతం పెరిగి పంట దిగుబడులు 5 నుంచి 10శాతం పెరిగే అవకాశముంది.
- దుక్కి దున్నే సమయంలో సూపర్ పాస్పెట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా అందు బాటులోకి వస్తాయి.
- ఫలితంగా డీపీఏ వాడకం సగం వరకు తగ్గుతుంది.
- దున్నడం వల్ల ఎకరాకు దాదాపుగా టన్ను ఎరువు తయారవుతుంది.
- మొక్కలకు 2శాతం నత్రజని(యూరియా), 4 శాతం పాస్పరస్ అదనంగా అందిస్తుంది.
- జింక్ మాంగనీస్, ఇనుము, కాల్షియం లాంటి సూక్ష్మదాతువులు పంటకు మేలు చేకూర్చుతాయి.
- నేలలో కరగని మూలకాలను అనుకూలంగా మార్చుతుంది. నీటి నిల్వ పెరుగుతుంది.

పట్నం ప్రజలకు.. పల్లె వెలుగులేనా..



- నియోజకవర్గ కేంద్రమైనా చెన్నూరు ప్రజలకు పాత బస్సులే దిక్కు.
- బస్సుల్లో పెరుగుతున్న రద్దీతో ప్రయాణికుల పాట్లు
- ఆదాయంపైనే ఆర్టీసీ దృష్టి



చెన్నూర్ బస్టాండ్‌లో ఉన్న పల్లె వెలుగు బస్సులు

చెన్నూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల ఆర్టీసీ డీపోకు ఆదాయంలో గుండెకాయ లాంటి చెన్నూరు రూట్‌లో దశాబ్దాల తరబడి పల్లె వెలుగు బస్సులే దిక్కవుతున్నాయి. నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నా ఆధునిక వసతులపై ఆర్టీసీ దృష్టి పెట్టలేక పోతోంది. దీంతో పల్లె వెలుగు బస్సులోనే గంటల తరబడి ప్రయాణం చేయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. వేమనపల్లి, కోటపల్లి మండలాలతో పాటు సరిహద్దు రాష్ట్రమైన మహారాష్ట్ర, పక్క జిల్లాలోని పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు పల్లె బస్సులతో పాటు ప్రైవేటు వాహనాల్లో ఇబ్బందులు పడుతూ చెన్నూరుకు చేరుకుంటారు. ఇక్కడ నుంచి మంచిర్యాలకు వెళ్లేందుకు వారికి మళ్లీ అదే గోస తప్పడంలేదు. గంటల కొద్ది నిరీక్షిస్తే కానీ ఓ బస్సు రాదు. వచ్చిన బస్సులో ప్రయాణికులు కిక్కిరిసి ఎక్కడంతో ఎక్కడ ఏం ప్రమాదం జరుగుతుందోనని జనం ఆందోళన చెందుతున్నారు. అయితే ఆ నడిపే బస్సు కూడా పాత కాలం బస్సు కావడంతో మంచిర్యాలకు ఉన్న 40 కిలో మీటర్ల దూరాన్ని చేరుకునేందుకు గంటకు పైగానే సమయం పడుతుండడంతో ప్రయాణికులు అసహనం కోల్పోతున్నారు.

ప్రయాణికులకు తప్పని పాట్లు..

మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో రద్దీ పెరగడంతో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. ఏ బస్సు చూసినా కిక్కిరిసిపోయి ఉండడంతో బస్సుల్లో ప్రయాణించాలంటేనే వెనుకడుగు వేస్తున్నారు కొంత మంది ప్రయాణికులు. చెన్నూర్ నుంచి మంచిర్యాలకు నాన్‌స్టాప్ బస్సులు లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతే కాకుండా దశాబ్ద కాలంగా వాడుతున్న డొక్కు బస్సులనే ఈ రూట్లలో నడిపిస్తుండడం, సమయం వేళలకు అనుకూలంగా అది గమ్యానికి చేరకపోవడంతో ప్రయాణికులు నానా ఇబ్బందుల పాలవుతున్నారు. దీనికి తోడు మహాలక్ష్మీ పథకం అమలులోకి వచ్చాక ప్రతి బస్సులో ఇసుక వేస్తే రాలనంతగా జనం ఉండడం పరి పాటిగా మారింది. రోడ్డుపై ప్రయాణికులు చెయి ఎత్తినచోట బస్సును ఆపడం, చెన్నూరు నుంచి మంచిర్యాలకు ఎక్కువ స్టాప్‌లు ఉండడంతో నేరుగా మంచిర్యాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆర్టీసీగా ఆదాయం ఫుల్‌గా వస్తున్నా సౌకర్యాలపై మాత్రం దృష్టి పెట్టక పోవడం గమనార్హం. కనీసం మంచిర్యాల నుంచి చెన్నూరుకు, చెన్నూరు నుంచి మంచిర్యాలకు కొన్నైనా నాన్‌స్టాప్ ఎక్స్‌ప్రెస్‌లను నడిపిస్తే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని, దీనిపై ఎమ్మెల్యే వివేక్ దృష్టి సారించి ఆ దిశగా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

ప్రైవేటు వైపే మొగ్గు...

చెన్నూర్ నుంచి మంచిర్యాలకు బస్సుల సంఖ్య కొన్నేళ్ల క్రితం ఎంత ఉందో ప్రస్తుతం కూడా అంతే ఉంది. అయితే ప్రయాణికుల సంఖ్య మాత్రం అందుకు మూడురెట్లు పెరిగింది. దీనికి కారణం మహాలక్ష్మి పథకం అమల్లోకి రావడం. మహిళలకు ఫ్రీ బస్ అమలయ్యాక బస్సుల్లో రద్దీ విపరీతంగా పెరిగింది. దీంతో బస్సులో ఎక్కిన పురుషులకు కూర్చుందామంటే సీట్లు లేకుండా పోతున్నాయి. కనీసం నిల్చుని వెళ్లే స్థలం కూడా లేనంతగా కిక్కిరిపోతున్నారు. దీంతో కొంతమంది ప్రయాణికులు ప్రైవేటు వాహనాలవైపే మొగ్గు చూపుతున్నారు. అన్ని గ్రామాలకు బస్సులు వెళ్లక పోవడం కూడా ఇందుకు ఒక కారణం అవుతోంది. దీంతో చాలా మంది ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. కానీ ప్రైవేటు వాహనాలు వేగంపై నియంత్రణ లేక పోవడం ప్రయాణికుల ప్రాణాల మీదకు తెస్తోంది. గత్యంతరం లేక ఎక్కుతున్నామని, ఫ్రీబస్ పథకం ద్వారా బస్సుల్లో నిల్చునేందుకు కూడా స్థలం ఉండడం లేదని కొంతమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఒక్క చెన్నూరు నుంచే నిత్యం మంచిర్యాలకు టాట ఏస్ వాహనాలు ప్రయాణికులతో వంద ట్రిప్పులకు పైగా కొడుతుందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వీటితో పాటు మరో 60టాటాఏస్ వాహనాలు మండలంలోని పల్లెలకు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రైవేటుదందా ఇంత సాగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం, గ్రామాలకు బస్సుల సౌకర్యం కల్పించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కనీసం ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు, ఈ ప్రాంత పాలకులు స్పందించి చెన్నూరు రూట్‌లో నాన్‌స్టాప్ ఎక్స్‌ప్రెస్ బస్సులతో పాటు ఎలక్ట్రిక్ బస్సులు, అన్ని గ్రామాలకు బస్సులను నడపాలని ప్రజలు కోరుతున్నారు.



బస్టాండ్‌లో బస్సు కోసం చూస్తున్న ప్రయాణికులు

ప్రతీ పది నిమిషాలకు ఒక బస్సు

మంచిర్యాల నుంచి చెన్నూరు రూట్లో ప్రతి పది నిమిషాలకు ఒక బస్సును నడుపుతున్నాం. చెన్నూరుకు రోజు దాదాపు 64 ట్రిప్పుల బస్సులు నడుస్తున్నాయి. అలాగే ఎక్స్‌ప్రెస్ బస్సులు కాళేశ్వరం, సిరొంచ, మహారాష్ట్ర ప్రాంతాలకు నడుస్తున్నాయి. శుభకార్యాలు, పాఠశాలలు, కళాశాలల సమయంలో విద్యార్థులు ప్రయాణిస్తుండడంతో ట్రాఫిక్ అధికంగా ఉంటోంది. ఎలక్ట్రిక్ బస్సులు నడిపిం చేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నాం.

- జనార్దన్, మంచిర్యాల ఆర్టీసీ డిపో మేనేజర్

పీఎస్ హెచ్ఎం పోస్టుల భర్తీ ఎప్పుడు..?

(5వ పేజీ తరువాయి)

ఎస్జీటీలకు పదోన్నతి కల్పించే అవకాశం ఉన్నా సంఘాలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కనీసం పాఠశాలలకు వేసవి సెలవులు ముగిసే లోపైనా పదోన్నతులు కల్పించాలనే డిమాండ్లు ఉన్నాయి.

పీఎస్ హెచ్ఎం పోస్టుల కోసం ఎదురు చూపులు..

గతంలో రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా 10వేల పీఎస్ హెచ్ఎం పోస్టులు భర్తీ చేస్తే కొంతవరకైనా తమ సమస్యలు తీరుతాయనే భావనలో ఎస్జీటీలు ఉన్నారు. అలాగే ఉన్నత పాఠశాలల మాదిరిగా ప్రాథమిక పాఠశాల్లో కూడా పీఎస్ హెచ్ఎం పోస్టులు మంజూరు చేస్తే బోధనేతర పనులు చూసుకోవడానికి వీలు కలుగుతుందని, తద్వారా ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు విద్యాబోధన మీద దృష్టిపెట్టే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. 20 నుంచి 30 ఏళ్లపాటు పని చేస్తూ ఎలాంటి పదోన్నతులకు నోచుకోని ఎస్జీటీలకు ప్రతి పాఠశాలలో ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ పోస్టులు ఇవ్వడం వల్ల పదోన్నతుల అవకాశం పెరిగి సంతృప్తి చెందుతారని భావి స్తున్నారు. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటే జిల్లాలో దాదాపు మరో 150 మంది వరకు ఎస్జీటీలకు లబ్ది చేకూరే అవకాశం ఉంది. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా 10వేల పోస్టులు మంజూరు చేసి ఎస్జీటీలకు న్యాయం, తద్వారా ప్రాథమిక పాఠశాలలను కాపాడాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

పోస్టులు మంజూరు చేయాలి...ఆళ్ల రాజేందర్

సికిందరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి



గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా వెంటనే 10వేల వరకు పీఎస్ హెచ్ఎం పోస్టులను మంజూరు చేయాలి. ఈ పోస్టులను అర్హత గల అందరు ఎస్జీటీలకు కేటాయించాలి. తద్వారా ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని సుప్రీం కోర్టులో కేసు వేయడం ద్వారా న్యాయ వివాదాలను పరిష్కరించాలి. అప్‌గ్రేడ్ అయిన భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టుల లో జీవోలు సవరించి ఎస్జీటీలకు పదోన్నతులకు అవకాశం కల్పించాలి.

గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో వృద్ధుడి హత్య

వేమనపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్మలపేట గ్రామానికి చెందిన బద్ది లచ్చయ్య (69) అనే వృద్ధుడు ఆదివారం తెల్లవారుజామున హత్యకు గురైనట్లు నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం లచ్చయ్య ప్రాణహిత నదిలో పడవ నడుపుతూ జీవిస్తున్నాడు. కొంత కాలంగా లచ్చయ్యకు ఇద్దరు భార్యలు ఉండగా ఇద్దరు మృతిచెందడంతో ఒంటరిగా ఇంట్లో ఉంటున్నాడు. ఆదివారం తెల్లవారుజామున ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు లచ్చ య్యను హత్య చేశారు. ఉదయం లచ్చయ్య కోడలు ఇంటికి వచ్చి చూడగా రక్తపు మడుగులో పడి ఉండడంతో కుటుంబీకులకు సమాచారం అందించింది. దీంతో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి వివరాలను సేకరించినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు నారాయణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి తొమ్మిది మంది సంతానం ఉన్నట్లు తెలిపారు.

మేదరిపేటలో బంద్ విజయవంతం

దండేపల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జమ్ము కాశ్మీర్‌లో పహల్గాంలో పర్యాటలకుపై ఉగ్రదాడిని నిరసిస్తూ ఐక్య వ్యాపార వర్తక సంఘం ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం దండేపల్లి మండలం మేదరిపేటలో నిర్వహించిన బంద్ విజయవంతమైంది. వ్యాపారస్థులు స్వచ్ఛందంగా వ్యాపార సముదాయాలను మూసి వేశారు. ఉగ్రవాదుల వాడిలో మరణించిన వారికి ఆత్మకు శాంతి కలగాలని వ్యాపారస్థులు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా ఆదివారంరాత్రి మేదరిపేటలో హనుమాన్ గుడి నుంచి బస్టాండ్ వరకు కొవ్వొతుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐక్య వ్యాపార వర్తక సంఘం పాల్గొన్నారు.

వేమనపల్లి: పహెల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి సంతాపంగా శనివారం రాత్రి వేమనపల్లి మండల కేంద్రంలో గ్రామంలోని యువకులు, ప్రజలు క్యాండీల్ ర్యాలీ నిర్వహించారు. మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కోరారు.

కొవ్వొత్తుల ర్యాలీ

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కోరుతూ, దాడిలో మరణించిన వారికి సంతాపంగా ఆదివారం రాత్రి కాంగ్రెస్ పార్టీ సేవాదళ్, బీసీ సంఘం నాయకులు జిల్లా కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకుడు నీలకంటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

●హమాలీవాడలోని సీఎస్ఐ చర్చీ ఆవరణలో ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. చర్చి ఫాదర్ శ్రీనివాస్, పాస్టర్స్ రేట్ బేరర్స్ కార్యదర్శి పద్మారావు, కోశాధికారి వెంకటరాజం, జయప్రద పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని ధర్నా

జన్నారం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని రేండ్లగూడ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు జరపడం లేదని, వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని ఆదివారం ప్రధాన రహదారిపై రైతులు ధర్నా నిర్వహించారు. ఇదే సమయంలో వరంగల్ సభకు తరలివెళ్తున్న మాజీ జెడ్పీ ఛైర్మన్ జనార్ధన్ రాథోడ్ ధర్నా చేస్తున్న రైతులకు మద్దతు తెలిపారు. వెంటనే ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలతో ఎంతో మందికి మేలు

బెల్లంపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వైద్య శిబిరాలతో ఎంతో మందికి మేలే జరుగుతుందని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. ఆదివారం కామినేని ఆసుపత్రివారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. వైద్య శిబిరాల్లో రక్త, వివిధ పరీక్షలతో ఎటువంటి వ్యాధులు ఉన్నాయో తెలుస్తుందన్నారు. ఫలితాల ఆధారంగా వైద్యులు చికిత్స అందిస్తారని వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాయకులు బండి ప్రభాకర్, నూరి బాబు, చిలుముల శంకర్, రాంచందర్ పాల్గొన్నారు.

బీరన్న ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

నెన్నెల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గొల్ల, కురుమల ఆరాధ్య దైవం బీరన్నకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రత్యేక పూజలు చేశారు. గొల్లపల్లిలో ఆదివారం నిర్వహించిన బీరన్న కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పాడి పంటలతో నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని వేడుకున్నట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కుల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అంతకంటే ముందుగా స్థానిక మహిళలు శోభాయాత్రగా వెళ్లి బీరన్నకు బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గట్టు మల్లేష్, నాయకులు హరీష్‌గౌడ్, శ్రీనివాస్, కొ మ్ము రాజన్న యాదవ్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అక్రమ వసూళ్లు

కాసిపేట, ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పేరుతో స్థానిక కాంగ్రెస్ నాయకులు అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షులు సూరం సంపత్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నిరుపేదలకు గూడు కల్పించేందుకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తోంది. కొందరు కాంగ్రెస్ నాయకులు స్వార్థపూరితంగా ఆలోసించి కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మండలంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల నుంచి కొందరు దళారులుగా ఏర్పటి డబ్బులు వసూలు చేయడం బాధాకరమన్నారు. ఇప్పటికైన అర్హులైన వారిని గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

కోటపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కోటపల్లి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కళాశాలలో ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 6వ తరగతికి సంబంధించి 51 మంది విద్యార్థులు హాజరు కాగా 7 నుంచి 10వ తరగతులకు సంబంధించి ఏడుగురు విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌గా రాజశేఖర్, డిపార్టుమెంటల్ అధికారిగా రాజమౌళితో పాటు ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించారు.పరీక్ష కేంద్రం వద్ద ఎస్ఐ రాజేందర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఎమ్మెల్యే పరామర్శ

జైపూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో మృతి చెందిన వారి కుటుంబాలను ఎమ్మెల్యే వివేక్ ఆదివారం పరామర్శించారు. పౌనూరు గ్రామంలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు మంతెన కుమార్ కుటుంబాన్ని, శివ్వారం గ్రామంలో మాజీ సర్పంచు ఆవిడపు గణేష్ తల్లి మృతిచెందగా ఆ కుటుంబాన్ని, వేలాల గ్రామంలో పార్టీ సీనియర్ నాయకుడు నగేష్ అనారోగ్యంతో బాధపడుతుండగా అతన్ని ఆదివారం ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పరా మర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఫయాజ్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారా యణరావు, పాపిరెడ్డి పాల్గొన్నారు.

గూడెం ఆలయ భూములపై వెలసిన ఫ్లెక్సీలు

దండేపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం గూడెం ఆలయ భూములను కాపాడాలంటూ సేవ్ గూడెం సేవ్ అయ్యప్ప పేరుతో ఆదివారం ఫ్లెక్సీలు వెలిసాయి. ఆదివారం ఉదయం గూడెం, కన్నెపల్లి, కరీంనగర్ చౌరస్తా వద్ద ఫ్లెక్సీలు భక్తుల పేరిట వెలిశాయి. గుర్తు తెలియని వ్యక్తులు గూడెం శ్రీసత్యనారాయణ స్వామి ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని అయ్యప్పస్వామి ఆలయాన్ని దేవాదాయ శాఖలో విలీనం చేసి, ఆ ఆలయాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. గూడెం సత్యనారాయణ స్వా మి ఆలయ భూములను అన్యక్రాంత కాకుండా కాపాడండి అంటూ, ప్రైవేటు వ్యక్తి చేతులో గూడెం దేవదాయ భూములా అంటు అందులో కోరారు. దీనిపై ఆలయ ఈవో శ్రీనివాస్‌ను వివరణ కోరగా సత్యనారాయణస్వామి ఆలయానికి సంబంధించి 12 ఎకరాల గుట్టఉందని, ప్రత్యేకించి వేరే భూముల లేవన్నారు. ఆలయ భూములపై ఇటివల డిజటల్ సర్వే చేపట్టమన్నారు. ఆలయ భూములు అన్యాక్రాంతం కాలేదని ఆయన వెల్లడించారు.

ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు



నస్పూర్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు



జెండా ఊపి సభకు బయలు దేరుతున్న మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య, నాయకులు

నస్పూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణంలో బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు ఆదివారం ఆ పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ తల్లి చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు పార్టీ జెండాను ఎగురవేశారు. మండల పార్టీ కార్యాలయం వద్ద పార్టీ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య జెండాను ఆవిష్కరించారు. బీఆర్ఎస్ నాయకులు విజిత్‌రావు, సురేందర్ రెడ్డి, వంగ తిరుపతి, సంపత్, అన్నపూర్ణ పాల్గొన్నారు.

●రజతోత్సవ సభకు నస్పూర్ నుంచి వాహనాల్లో తరలివెళ్లారు.

దండేపల్లి: మండలంలో ఊరురా బీఆర్ఎస్ పార్టీ నాయకులు జెండాను ఆవిష్కరించారు. పార్టీ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ పసర్తి అనిల్‌కుమార్ బీఆర్ఎస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జన్నారం : బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను ఆదివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక తెలంగాణ తల్లి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాల వద్ద బీఆర్ఎస్ నాయకులు జెండా ఆవిష్కరించారు. అనంతరం వరంగల్ ఎల్కతుర్తి కేసీఆర్ సభకు బయలుదేరివెళ్లారు. నాయకులు రాజారంరెడ్డి, భరత్ కుమార్, మున్వర్ ఆలీ పాల్గొన్నారు.

భీమారం : ఎల్కతుర్తిలో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ సభకు పార్టీ ప్రెసిడెంట్ కలగూర రాజ్‌కుమార్, వెంకటేశ్వర్లు, రాము, దీపక్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు.

మందమర్రిరూరల్: మండలంలోని గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు తరలి వెళ్లారు. పొన్నారంలో మాజీ జడ్పీటీసీ వేల్పుల రవి జెండా ఊపి సభకు వెళ్లే వాహనాలను ప్రారంభించారు.

కాసిపేట: బీఆర్ఎస్ సభకు మండల బీఆర్ఎస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. మాజీ జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, మాజీ ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్ తరలివెళ్లారు.

బెల్లంపల్లి: రజతోత్సవ సభకు ఆదివారం మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఆయా మండలాల నాయకులు ప్రత్యేక వాహనాల్లో బయలు దేరారు. అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ రజతోత్సవ సందర్భంగా జెండా ఎగురవేశారు.

గర్మిళ్ల : మంచిర్యాలలోని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు నివాసం వద్ద ఆదివారం పార్టీ జెండాను దివాకర్‌రావు ఎగురవేశారు. బీఆర్ఎస్ నాయకులు నడిపెల్లి విజిత్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా నుంచి పలువురు టీబీజీకేఎస్ నాయకులు తరలివెళ్లారు. సభకు తరలివెళ్లిన వారిలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, నాయకులు ఉన్నారు.

కోటపల్లి: కేసీఆర్ బహిరంగ సభకు కోటపల్లి మండలం నుంచి ప్రత్యేక బస్సుల్లో బీఆర్ఎస్ నాయకులు తరలి వెళ్లారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారిశెట్టి విద్యాసాగర్ ఆధ్వర్యంలో వందలాది మంది కార్యకర్తలు సభకు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో నాయకులు వాలా శ్రీనివాసరావు, సాంబగౌడ్, కొట్టి నారాయణ ఉన్నారు.

జైపూర్ : మండలంలోని గ్రామాల నుంచి ఆదివారం వరంగల్‌లో జరిగిన కేసీఆర్ సభకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బస్సుల్లో తరలి వెళ్లారు. అంతకుముందు గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు.

గంజాయి నిర్మూలనకు పోలీసుల కృషి అభినందనీయం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే వినోద్

తాండూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : గంజాయి నిర్మూలనకు పోలీసు శాఖ కృషి చేయడం, అందులో భాగంగా కబడ్డీ పోటీలు నిర్వహించడం హర్షణీయమని బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ పేర్కొన్నారు. గత మూడు రోజులుగా తాండూర్ సీఐ కుమారస్వామి ఆధ్వర్యంలో తాండూర్‌లోని సీఐ కార్యాలయం ఆవరణలోని క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న యాంటీ డ్రగ్స్ అవెర్‌నెస్ కబడ్డీ కప్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. విజేతలకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ బహుమతులు అందించారు. గంజాయి వదిలేద్దా కబడ్డీ ఆడేద్దాం అనే కార్య క్రమాన్ని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు రాం చందర్ ఆధ్వర్యంలో నిర్వహించగా మొదటి బహుమతి వేమనపల్లి జట్టుకు రూ. 40 వేలు, రెండవ బహుమతి తాండూర్ (బీ) రూ. 30 వేలు, మూడవ బహుమతి తాండూర్ (ఏ) రూ. 20 వేలు, నాలుగో బహుమతి మం దమర్రి (ఏ) రూ. 10 వేలు అందజేశారు. గోలేటి జీఎం భాస్కర్‌రెడ్డి, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, తాండూర్ సీఐ కుమారస్వామి, ఎస్ఐ కిరణ్‌కుమార్, మాదారం ఎస్ఐ సౌజన్య, భీమిని ఎస్ఐ విజయ్‌కుమార్, కన్నెపల్లి ఎస్ఐ గంగారాం, బెల్లంపల్లి వన్‌టౌన్ సీఐ దేవయ్య, కాంగ్రెస్ నాయకులు మురళీధర్‌రావు, రవీందర్‌రెడ్డి, మహేందర్‌రావు, ఎండీ ఈసా, సిరంగి శంకర్, రత్నాకర్, ఎస్ఐలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

కాసిపేట, ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీలోకి దేవాపూర్‌కు చెందిన మాజీ సర్పంచ్ దంపతులు తిరుమల అనంత్‌రావు, స్థానిక యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్‌పై వ్యతిరేకత కాసిపేట మండలం నుంచే ప్రారంభమైందని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య గుర్తు చేశారు. పార్టీ మండల అధ్యక్షులు రమణారెడ్డి, చందు, కైలాస్ పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

మంచిర్యాలక్రైం, ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల కార్పొరేషన్‌పరిధిలోని తిలక్‌నగర్‌లో పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. బీసీసీ అధ్యక్షురాలు వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక బోనాన్ని సమర్పించారు. సురేఖతోపాటు కుమారుడు కొక్కిరాల చరణ్‌రావు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

కోటపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కోటపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మంత్రి రామయ్య ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. అకాల వర్షాలతో ఆరబోసిన వడ్లు తడిసి ముద్దయ్యే ప్రమాదం ఉందని, వెంటనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే స్పందించి కొనుగోలు కేంద్రం ప్రారంభించి అన్నదాతలను ఆదుకోవాలని ఆయన కోరారు.



హ్యాండ్‌బాల్ పోటీల్లో బంగారు పతకం

గర్మిళ్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 24 నుంచి 26 వరకు హన్మకొండలోని జేఎన్ ఎంస్ స్టేడియంలో జరిగిన 7వ తెలంగాణ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టాలెంట్ హంట్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సబ్ జూనియర్ బాలికల జట్టు ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. శనివారం రాత్రి జట్టు క్రీడా కారులకు మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమేష్, కోశాధికారిగా రమేష్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా సెక్రటరీ రఘునాధ్‌రెడ్డి ఘనంగా పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. కోచ్ అరవింద్, మేనేజర్ సాయిలను సన్మానించారు.

కవ్వాలలో ఆర్డీవో పర్యటన



కవ్వాల అభయారణ్యం వద్ద ఆర్డీవో,కుటుంబీకులు

జన్నారం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కవ్వాల టైగర్ జోన్‌లోని జన్నారం అటవీ ప్రాంతంలో ఆదివారం ఉదయం మంచిర్యాల ఆర్డీవో గూడూరి శ్రీనివాసరావు, కుటుంబీకులతో పర్యటించారు. అటవీ ప్రాంతంలోని గేండుగూడ, మైసంపేట, అటవీ ప్రాంతంలో సఫారీలో పర్యటించారు. అడవిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతం ఎంతో ఆహ్లాదకరంగా ఉందని తెలిపారు. ఎఫ్ఆర్వో శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

● ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాలక్రైం, ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయినుంచి బలోపేతం చేయడమే లక్ష్యంగా పార్టీ నిర్మాణంలో కొత్త ప్రక్రియకు కాంగ్రెస్ శ్రీకారం చుట్టిందని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అన్నారు. మంచిర్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో తెలంగాణ ఆయిల్‌సీడ్ కార్పొరేషన్ చైర్మన్ నియోజకవర్గ అడ్వయిజర్ జంగ రాఘవరెడ్డితో పాటు పీసీసీ సభ్యులు రాంగోపాల్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. సభకు కొక్కిరాల సురేఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీని బూత్‌లెవల్ స్థాయి నుంచి గ్రామీణ, మండల జిల్లాస్థాయిలో పటిష్ట పరిచాలన్నారు. కష్టాకాలంలో పార్టీవెన్నంటిఉన్న కార్యకర్తలను పార్టీ నాయకత్వం గుర్తిస్తుందన్నారు. పదవుల కోసం కాకుండా పార్టీ కోసం పని చేయాలన్నారు. పార్టీకోసం పని చేసిన వారికి స్థానిక ఎన్నికల్లో అవకాశం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తల్లో నూతనొత్తేజాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి బ్లాక్ కాంగ్రెస్ నాయకలు కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఎస్ హెచ్ఎం పోస్టుల భర్తీ ఎప్పుడు..?





- 10వేల పోస్టుల భర్తీకి గత ప్రభుత్వం హామీ
- 20 ఏళ్లుగా ఎస్జీటీల ఎదురు చూపులు
- పదోన్నతికి నోచుకోని ఉపాధ్యాయులు
- ప్రభుత్వం చొరవ తీసుకోవాలని వేడుకోలు

మంచిర్యాల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగంలో దీర్ఘకాలికంగా నెలకొన్న అనేక సమస్యలు గత ప్రభుత్వ నిర్లక్ష్యవైఖరి కారణంగా పరిష్కారానికి నోచుకోలేదు. కాంట్రిబ్యూటరీ పెన్షన్‌విధానం రద్దు, పెండింగ్ బిల్లుల పరిష్కారం, తెలంగాణలో 2వ పీఆర్సీ, పెండింగ్ డీఏల ప్రకటన, ప్రాథమిక పాఠశాలల్లో పీఎస్ హెచ్ఎం పోస్టుల భర్తీ వంటి అనేక సమస్యలకు పరిష్కారం చూపకపోవడంతో విద్యారంగంపై తీవ్ర ప్రభావం చూపింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత విద్యారంగం పట్ల దృష్టి సారించడంతో ఉపాధ్యాయ లోకానికి ఊరట లభించి నట్లయింది. ప్రస్తుత ప్రభుత్వం భాషా పండితులు, పీఈటీల ఉన్నతీకరణ చేపట్టడంతో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఆయా విభాగాలకు చెందిన ఉపాధ్యా యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 10,479 పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి, ఆ దిశగా చర్యలు కూడా చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో భాషా పండితులు, పీఈటీల పదోన్నతి ప్ర క్రియ కూడా పూర్తికాగా, గ్రేడ్-1 స్థానం లభించింది.

స్థానం దక్కని ఎస్జీటీలు...

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కేటగరీల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ప్రభుత్వం సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీలు)కు మాత్రం స్థానం కల్పించకపోవడంతో వారంతా తీవ్ర నిరాశ, నిస్పృహ ల్లో ఉన్నారు. ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేస్తానని ప్రకటిం చిన 10,479 పోస్టుల్లో తెలుగు-4493, హిందీ-3883, పీఈటీ-1778 ఉన్నాయి. మిగతా కొన్ని ఇతర మైనర్ మీడియం పోస్టులు ఉన్నాయి. మంచిర్యాల జిల్లా విషయానికి వస్తే తెలుగు-115, హిందీ-110, పీఈటీ-33 పోస్టులను గ్రేడ్-1గా అప్‌గ్రేడ్ చేశారు. అప్‌గ్రేడేషన్ తరువాత జిల్లాలో అతికొద్ది మంది మాత్రమే గ్రేడ్-2 ఉపాధ్యాయులుగా మిగిలిపో యారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల భాషా పండితులు, పీఈటీలు ఆనం దం వ్యక్తం చేస్తుండగా, ఏన్నో ఏళ్లుగా పదోన్నతుల కోసం వేచి చూస్తున్న ఎస్జీటీలు మాత్రం నిరుత్సా హానికి గురవుతున్నారు. నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) నిబంధనల ప్రకారం అర్హ త కలిగిన ఎస్జీటీలకు అప్‌గ్రేడేషన్ ప్రక్రియలో మొం డిచేయి చూపి, తమకు రావలసిన పదోన్నతులను దూరం చేశారని, అర్హతగల ఎస్జీటీలు వాపోతున్నా రు. గతంలో కామన్ సీనియారిటీతో పదోన్నతులు తీ సుకున్నప్పటికీ కూడా అప్‌గ్రేడేషన్ ప్రక్రియలో సం ఘాలు ఎస్జీటీలకు మొండి చేయి చూపారని విచా రం వ్యక్తం చేస్తున్నారు. అప్ గ్రేడేషన్ ప్రక్రియ పూ ర్తయి, భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయు లు అందరూ పదోన్నతులు పొందినప్పటికీ, ఎస్జీటీల కు తదుపరి అవకాశం కల్పిస్తూ జీవో సవరించడంలో కృషి చేయడంలేదని, రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో ఎస్జీటీలు ప్రభుత్వంతోపాటు యూనియన్లపై ఆగ్ర హంతో ఉన్నారు. అప్‌గ్రేడేషన్‌లో అర్హత కలిగి ఉ న్నందున ఎస్జీటీలు తమకు కూడా అవకాశం కల్పిం చాలని పోరాటం చేస్తున్నారు. అప్‌గ్రేడేషన్ కంటే ముందున్న ఖాళీగా ఉన్న సుమారు వెయ్యి పోస్టుల్లో కూడా న్యాయపరంగా..

(తరువాయి 7లో)

దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మార్క్స్‌భవన్‌లో నిర్వహించిన కార్మిక సంఘాల సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాసేందుకు కుట్రలు చేస్తుం దన్నారు. కాంట్రాక్టు కార్మికులను పట్టించుకోవడం లేదన్నారు. 44 కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలని, కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభు త్వ ఆధీనంలోనే ఉండాలని, ప్రభుత్వ రంగ సంస్థల్లో విదేశీ ప్రత్యక్ష పె ట్టుబడులను ఉపసంహరించుకోవాలని, స్కీం వర్కర్లను క్రమబద్ధీక రించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో కా ర్మికులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్ర మంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, నాయకులు సూర్యం, పౌలు, కలీందర్‌ఖాన్, మల్లేష్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

లక్సెట్టిపేట(హాజీపూర్), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండల కేంద్రంతో పాటు దొనబండ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా అడిషనల్ కలెక్టర్ మోతీలాల్ ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా అడీషనల్ కలెక్టర్ మాట్లాడుతు ప్రభు త్వం రైతుల సంక్షేమం కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చే సినట్లు రైతులకు కేంద్రాల వద్ద కనీస వసతులు కల్పించాల్సిన బాధ్య త కేంద్రం నిర్వహకులదే అన్నారు. సంచికి సంచి వేసి తూకం వేయాలని రైతులు కూడా నాణ్యమైన ధాన్యం కేంద్రంకు తీసుకువచ్చి ప్రభుత్వ మ ద్దతు ధర పొంది కేంద్రం నిర్వహకులకు సహకరించాలని కోరారు. అనం తరం ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. కేంద్రం నిర్వాహకులకు ప లు సలహాలు సూచనలు అందజేసారు. ఈకార్యక్రమంలో అడిషనల్ కలె క్టర్ వెంట సంబంధిత అధికారులు రైతులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

మందమర్రిటౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బాలాజీ గ్రామర్ పాఠశాలకు చెందిన 1999-2000 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలను ఆదివారం మంచిర్యాలలోని నార్తిన్ కన్వెన్షన్‌లో ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలుకరించుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి గురువులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాంబాబు, పూర్వ విద్యార్థులు వెంకటేష్,మల్లేశ్వరి, సాయిబాబ, వేణు, లక్ష్మణ్, గణపతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సేవలు అభినందనీయం


ఎమ్మెల్యే వినోద్‌కు స్వాగతం పలుకుతున్న గిరిజనులు

తాండూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు గ్రామాల ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మాదారం పోలీసులు, మంచిర్యాల మెడిలైఫ్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని నర్సాపూర్ గ్రామంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజనులకు ఎల్లప్పుడు తోడుగా ఉంటామని వైద్య శిబిరాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందని, ఇందుకు పోలీసు శాఖను అభినందిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు గిరిజనులు ఎమ్మెల్యే, పోలీసులకు గిరిజన సంప్రదాయ నృత్యాలతో, మంగళహారతులతో స్వాగతం పలికారు. కాగా ఈ శిబిరంలో దాదాపు 500మంది గిరిజనులు పాల్గొనగా వైద్యులు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తాండూర్ సీఐ కుమారస్వామి, మాదారం, భీమిని ఎస్ఐలు సౌజన్య, విజయ్‌కుమార్, గ్రామ పెద్దలు పర్వతిరావు, భగవంతరావు, ప్రభాత్‌రావు, అమృతరావు, గంగుపటేల్ కాంగ్రెస్ నాయకులు రవీందర్‌రెడ్డి, ఈసా, మహేందర్‌రావు, మురళీధర్‌రావు, రాంచందర్, శంకర్, బానయ్య, విష్ణు కళ్యాణ్, అంజితదితరులు పాల్గొన్నారు.

అంబలి పంపిణీ కేంద్రం ప్రారంభం


నస్పూర్‌లో అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కొక్కిరాల ఉదయ్ చరణ్ రావు

నస్పూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం సీసీసీ కార్నర్ వద్ద కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్టు ద్వారా ఏర్పాటు చేసిన అంబలి పంపిణీ కేంద్రాన్ని ఆదివారం ఎమ్మెల్యే తనయుడు కొక్కిరాల ఉదయ్ చరణ్ రావు ప్రారంభించారు. వేసవి ఎండలను దృష్టి పెట్టుకుని ప్రజల దాహార్తిని తీర్చడానికి ఎంతో ఉపయోగపడుతుందని కొక్కిరాల ఉదయ్ చరణ్ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, నాయకులు సంపత్ రెడ్డి, ధర్ని మధుకర్, యశోద, నరేష్, అజేయ్ గౌడ్, పూదరి కుమార్, రిటైర్డ్‌మెంట్ కార్మికులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఏడాదిన్నర కాలంలో వెలగబెట్టిందేమిటి..

● ఎమ్మెల్యే వివేక్‌పై మండిపడ్డ బాల్క సుమన్


చెన్నూరులో జెండా ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

చెన్నూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఏడాదిన్నర కాలంలో చెన్నూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి వెలగబోసిందేంటని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సంవత్సరన్నర కాలంలో ఏం అభివృద్ధి చేశారని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో చేసిన అభివృద్ధి పనులను టెంకాయలు కొట్టి ప్రారంభించడం సిగ్గు చేటన్నారు. చెన్నూరులో సబ్‌స్టేషన్ నిర్మాణం, క్యాతనపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి ఎవరి హయాంలో నిర్మాణమయ్యాయో ప్రజలందరికి తెలుసన్నారు. 40ఏళ్ల కాంగ్రెస్ పాలనలో మీరే ఈ ప్రాంత నాయకులుగా కొనసాగారని, అప్పుడు ఈ ప్రాంతాన్ని ఎందుకు అభివృద్ధి చేయలేదన్నారు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే, సీఎంలు ఇచ్చిన హామీ లు ఏమయ్యాయన్నారు. ఇసుక అక్రమ రవాణా అడ్డగోలుగా జరుగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. ఇచ్చిన హామీలపై ఇక నుంచి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నిక ల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. అనంతరం వరంగల్ రజతో త్సవ సభకు వెళ్లే వాహనా లను జెండా ఊపి ప్రారంభించి సభకు తరలివెళ్లారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

●బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం మండలంలోని దుగ్నేపల్లి, అస్నాద, నాగా పూర్ తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ జెండాను ఆవిష్క రించారు. అనంతరం వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు.

ప్రయాణికులకు సరిపడా.. బస్సుల సంఖ్య పెంచుతాం

శ్రీరామ్‌జనార్ధన్, మంచిర్యాల ఆర్టీసీ డిపో మేనేజర్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మహాలక్ష్మీ పథకంతో బ స్సుల్లో మహిళల సంఖ్య పెరిగింది. దీం తో ప్రయాణికులకు కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బస్సుల సంఖ్య పెం చేందుకు ఉన్నతాధికారులకు నివేదిస్తు న్నాం అని ఆర్టీసీ మంచిర్యాల డిపో మేనేజర్ జనార్దన్ తెలిపారు. ఆంధ్రజ్యోతికి ఇ చ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు వివరాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి : మహాలక్ష్మీ పథకం మొదలైనప్పటి నుంచి కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి కదా? వాటిని ఎలా అధిగమిస్తున్నారు.

డీఎం : ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సం ఖ్య పెరిగింది. దీంతో కొంత ఇబ్బంది ఎదురవుతోం ది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బస్సుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా ప్రయత్నం చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : రద్దీ పెరిగింది. మరి బస్సుల సంఖ్య పెంచే ఆలోచన ఉందా?

డీఎం : బస్సుల సంఖ్యను పెంచలేదు. కానీ సర్వీసు ట్రిప్పుల సంఖ్య మాత్రం పెంచాం. చెన్నూరు వైపు, గోలేటి వైపు ట్రిప్పుల సంఖ్య పెంచాం.

ఆంధ్రజ్యోతి : బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణిస్తున్నారు. ప్రమాదం కాదా?

డీఎం : బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణిస్తున్నారు ఇది ప్రమాద మే. బస్సుల సంఖ్యను పెంచేందుకు ప్రయత్నం చేస్తున్నాం. ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : చెన్నూరుకు ఎలక్ట్రిక్ బస్సులు ఒక్కటి కూడా కేటాయించలేదు కదా? కారణం ఏంటి..

డీఎం : కొత్తగా వచ్చిన ఎలక్ట్రిక్ బస్సులను చెన్నూరుకు కేటాయించాలంటే అక్కడ చార్జింగ్ పాయింట్‌కు తగిన స్థలం అవసరం ఉంది. హెడ్ ఆఫీస్ నుంచి అనుమతి కూడా లభించాల్సి ఉంది. ఇవన్నీ సమకూరినాక ఎలక్ట్రిక్ బస్సులను నడిపే ప్రయత్నం చేస్తాం.

ఆంధ్రజ్యోతి : చెన్నూరు నుంచి మంచిర్యాలకు ఆదాయం బాగానే ఉంటుంది. మరి బస్సులు మాత్రం అవే పాత పల్లెవెలుగులే కొనసాగిస్తున్నారు అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. గోదావరిఖనికి డైరెక్టు బస్సులు కావాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఎందుకు నడపడం లేదు?

డీఎం : చెన్నూరు నుంచి గోదావరిఖనికి డైరెక్టు బస్సు కావాలని అక్కడి ప్రయాణికులు కోరుతున్నారు. కొత్తగా డ్రైవర్ల నియామకం జరుగు తుంది. వారు వచ్చిన తర్వాత చెన్నూరు నుంచి గోదావరిఖనికి డైరెక్టు బస్సు నడిపే ప్రయత్నం చేస్తాం.

ప్రజా క్షేమం కోసమే మేమున్నాం

● డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

మంచిర్యాలక్రైం, ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి): ప్రజాక్షేమం కోసమే మేమున్నామని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. మంచిర్యాల పట్టణంలో ఐబీ చౌరస్తా వద్ద అంబలి కార్యక్రమాన్నిప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో దాహార్తిని తీర్చేందుకు అంబలి కార్యక్రమం ప్రారంభించామన్నారు. ప్రతిసంవత్సరం లాగానే కొక్కిరాల రఘుపతిరావు చారిట్రబుల్ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలను ప్రజల కోసం సేవా చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రేంసాగర్‌రావు తనయుడు చరణ్‌రావు, తూముల నరేశ్, చిట్ల సత్యనారాయణ, తిరుపతి, వేణు చైర్మన్, నల్ల మహేశ్, సంపత్ రెడ్డి, బానేష్, సింగతి మురళి, సంజయ్‌రావు, రాజమౌళి పాల్గొన్నారు.

అకాల వర్షంతో అన్నదాతల ఆందోళన


దండేపల్లి కోనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలపై కవర్ల కప్పుతున్న రైతులు

దండేపల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): రైతులు అరుగాలం కష్టపడి పండించిన పంటలను అమ్ముకుందామంటే ప్రకృతి కూడా కన్నెర జేసి ఆకాల వర్షం కురువడంతో కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడ్డారు. మండలంలో శనివారం రాత్రి ఈదురు గాలు లతో కూడిన వర్షం కురువడడం, ధాన్యం కుప్పలపై కప్పిన కవర్లు లేచిపోవడంతో కోనుగోలు కేంద్రాల్లో రైతులు అరగోస పడ్డారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపి కోనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం కుప్పలు పోసి ఉంచారు.

వర్షం పడుతుందనే భయంతో ధాన్యం కాపాడునేందుకు రైతులు నానా తంటాలు పడుతూ అద్దెకు కవర్లు తీసుకవచ్చి ధాన్యం కుప్పలపై కవరు కప్పారు. కోనుగోలు కేంద్రాలలో రైతులకు టార్పలిన్ కవర్లు లేకపోవడం తో, వర్షానికి కొందరు రైతులు అద్దెకు కవర్లు తీసుకవచ్చి తడవకుండా కవర్లు కప్పుకున్నారు. ఆదివారం ఉదయం కూడా స్వల్పవర్షం కురువడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి కోనుగోలు కేంద్రా లలో టార్పలిన్లు కవరు అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు. తూకం వేసిన ధాన్యం బస్తాలను వెనువెంట రైస్ మిల్లులకు తరలించే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు.